www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025

గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలి

పంచాయతీ అధికారులకు జెడ్పి చైర్‌పర్సన్ పద్మశ్రీ సూచన

ఏలూరు సిటీ : గ్రామపంచాయతీల్లో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని పంచాయతీ అధికారులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నీటి కొరత లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. మంచినీటి చెరువులకు కాలువల నుంచి నీటిని పూర్తిస్థాయిలో నింపుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సూచనలు చేయాలని తెలిపారు. అదేవిధంగా శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పంచాయతీ ఆఫీసర్ కె.అనురాధ స్పందిస్తూ ఇప్పటికే కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామని, ప్రతిరోజూ కార్యాలయానికి పంచాయతీల నుంచి నీటిమట్టం స్థాయి వివరాలు, నివేదికలు పంపి ఇస్తున్నారని తెలిపారు.

ఎదురుచూపులే..!

'సిఎం గారూ.. మా అమ్మకు ఆరోగ్యం బాగోక లేవలేని పరిస్థితిలో ఉంది. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. వైద్యం ఖర్చు భారంగా ఉంది. మా అమ్మకు పింఛన్ ఇప్పించి ఆదుకోండి'.. గత శనివారం సిఎం తణుకు పర్యటనలో ఓ యువతి ఆవేదన ఇది.

'నాకు వివాహమై రెండేళ్లు కావొస్తోంది. రేషన్‌కార్డు కోసం సచివాలయానికి వెళ్తే కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని అక్కడి ఉద్యోగులు చెబుతున్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. త్వరగా ఇప్పించండి'.. గోపాలకృష్ణ అనే యువకుని గోడు ఇది.

కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం జనం నిరీక్షణ
కూటమి అధికారంలోకొచ్చి పది నెలలైనా స్పందన కరువు
ప్రతి సచివాలయంలోనూ వందల సంఖ్యలో దరఖాస్తులు
సిఎం పర్యటనలో బాధితుల నుంచి ఇవే వినతులు
ప్రభుత్వ తీరుపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ కొత్త రేషన్‌కార్డులుగాని, పింఛన్లుగాని మంజూరు చేసిన పరిస్థితి లేదు. అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపపు మాటలతో సరిపెట్టడం మినహా ఆచరణలో మాత్రం ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి. దీంతో ఎంతోమందికి రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 1,165 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయ పరిధిలో సరాసరిన వంద వరకూ కొత్త రేషన్‌కార్డు దరఖాస్తులు, 50 వరకూ పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులూ జారీ చేయకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ జనం తిరుగుతున్నారు. అనర్హులైన పింఛన్‌దారుల ఏరివేత ప్రక్రియ ముగిసినట్లుగా చెబుతున్నారు. తనిఖీల్లో ఎంతమంది అనర్హులుగా తేలారో అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. ప్రభుత్వం రేషన్, పింఛన్ల భారం తగ్గించుకునేందుకు ఉన్నవాటిని తొలగించడంతోపాటు, కొత్తవి సైతం ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిడ్నీ ఇతర దీర్ఘకాలిక రోగాలకు సైతం కొత్త పింఛన్ రాకపోవడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వ పథకం ఏది మంజూరు కావాలన్నా తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి రేషన్‌కార్డుల జారీపై స్పందన లేకుండాపోయింది. గత ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి, జూన్‌ల్లో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసేది. కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ ప్రారంభించలేదు. 2024 డిసెంబర్‌లో ఏలూరు జిల్లాలో 6.31 లక్షల రేషన్‌కార్డులు ఉండగా ఫిబ్రవరి నెలకు వచ్చేసరికి 6.20 లక్షలకు తగ్గిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 5.67 లక్షల కార్డులు ఉండగా 5.58 లక్షలకు తగ్గిన పరిస్థితి ఉంది. అనర్హుల ఏరివేత పేరుతో భారీగా రేషన్‌కార్డులు తొలగించినట్లు అధికార లెక్కలే చెబుతున్నాయి. పింఛన్ల విషయంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. రేషన్‌కార్డులు, పింఛన్ల తొలగింపు ప్రక్రియ గుట్టుగా సాగిస్తున్న ప్రభుత్వం కొత్తవి మాత్రం ఇవ్వడం లేదు. ఎన్నికల సమయంలో రేషన్‌కార్డులు, పింఛన్లపై అనేక హామీలు గుప్పించిన కూటమి అధికారంలోకొచ్చాక మాత్రం నోరు మెదపడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై జనాల్లో ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు ప్రక్రియ చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 91.60 శాతం మంది విద్యార్థుల హాజరు
పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పదవతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ఏలూరు అశోక్‌నగర్‌లోని కెడిడిటి పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో 192 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా నూరుశాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 25,179 మంది విద్యార్థులకుగాను 23,064 మంది విద్యార్థులు హాజరయ్యారని, 91.60 శాతం హాజరు నమోదైందని తెలిపారు. 2,115 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. 54 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయన్నారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీరు, ఇతర వసతులను, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన పదో తరగతి తెలుగు పరీక్షలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదన్నారు. పరీక్షా కేంద్రాల తనిఖీలో భాగంగా డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ తొమ్మిది కేంద్రాలు, డిఇఒ ఆరు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ నాలుగు కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పిజిఆర్ఎస్‌కు 318 అర్జీలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వడంతోపాటు అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోనిగోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్‌లో ఆమె జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి నాణ్యమైన ఎండార్స్‌మెంట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 318 అర్జీలు స్వీకరించామని తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో పి-4 సర్వే, ఎంఎస్ఎంఇ సర్వే నూరు శాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సూపర్ సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాచైతన్యయాత్ర ప్రారంభ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రను సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ జిఒ నెం.3కి చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకొచ్చాక ఎన్నికల హామీలను గాలికొదిలేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలే జవాబు ఇస్తాయని హెచ్చరించారు. అనంతరం మండలంలోని యర్రాయగూడెంలో జరిగిన సభలో బుట్టాయగూడెం, పోలవరం మండలాల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్ మాట్లాడుతూ గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్, 1/70 భూములకు పట్టాలివ్వాలని, అటవీ హక్కుల చట్టం 2006 అమలు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం పోలవరం నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. బుట్టాయగూడెంలో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, పోలవరంలో 30 పడకల హాస్పటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, విద్యాసంస్థల్లో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని అన్నారు. రెడ్డి గణపవరం, పట్టెన్నపాలెం వంతెనల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. బుట్టాయగూడెంలో ఆగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు వేసి బస్సు సౌకర్యం కల్పించాలని, బుట్టాయగూడెంలో ఇళ్ల స్థలాల్లో ఇళ్లు వేసిన గిరిజనులకు ఆ భూములపై హక్కులు కల్పించాలని, ప్రభుత్వ కాలనీలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక మన్యం జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఈ యాత్ర కెఆర్‌పురం, కామయ్యకుంట, రవ్వారిగూడెం, పులి రాముడుగూడెం పంచాయతీల్లోని గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో నేతలు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, పి.శేఖర్, ఎస్.సాయికృష్ణ, ఎస్.శ్రీను, కె.సత్యనారాయణ, అనూష, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర మండలంలో రెండో రోజు మైసన్నగూడెం నుంచి శ్రీనివాసపురం, అక్కంపేట, పట్టినపాలెం గ్రామాల మీదుగా సాగింది. జోడే సూర్యచంద్రం ఆధ్వర్యంలో సాగిన యాత్రలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పాల్గొని మాట్లాడారు. మైసన్నగూడెంలో 120/2 సర్వే నెంబర్ భూమిలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఈ సర్వే నెంబర్లలో భూస్వాములు ఆక్రమించుకున్న భూములను సర్వే చేసి పేదలకు పంచాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ కింద నూకాలమ్మ చెరువు, సూరయ్య చెరువు, నీటి బోదెల పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మైసన్నగూడెం, శ్రీనివాసపురం, బైపాస్ వరకు రోడ్డు నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలన్నారు. పట్టిన్నపాలెం వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి సుమారు 20 సంవత్సరాలైనా ఇప్పటివరకు వంతెన నిర్మాణం పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ తన పర్యటనల్లో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని, ఈ పద్ధతి సరికాదని అన్నారు. కార్యక్రమంలో నేతలు అందుగుల ప్రభాకరరావు, కాకుల సుబ్బారావు, పిల్లి పోతురాజు, పునపాకుల వీర్రాజు, పి.సుబ్బారావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

జంగారెడ్డిగూడెంలో..

ఎక్‌సాల్ పట్టాలివ్వాలి

ఎర్రకాలువ మిగులు భూముల సాగుదారులకు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

టి.నర్సాపురంలో...

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఎర్రకాలువ మిగులు భూములు సాగు చేస్తున్న గిరిజన పేదలకు ఏక్‌సాల్ పట్టాలు మంజూరు చేసి హక్కు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సమస్యలపై ప్రజలను చైతన్యపరుస్తూ హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర రెండో రోజైన సోమవారం మండలంలోని మల్లప్పగూడెంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి నేతృత్వాన ప్రారంభమైంది. ఈ యాత్ర మండలంలోని అబ్దుల్లాపురం, సాలిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, వెంకటాపురం గ్రామాల మీదుగా బొర్రంపాలెం చేరుకోవడంతో ముగిసింది. ప్రతి గ్రామంలో యాత్ర బృందానికి అడుగడుగునా ప్రజలు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. తమ సమస్యలు నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మండలంలో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కొన్ని నెలలుగా పనుల్లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది మల్లప్పగూడెంలో ఉపాధి హామీ పనులు చేసిన వారికి మూడు వారాలు ఉపాధి పనులు చేయించి పేర్లు రాలేదని సాకులు చెప్పి డబ్బులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మల్లప్పగూడెం, సాలిగూడెం గ్రామాల్లో శ్మశానవాటిక సమస్య ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. మధ్యాహ్నపువారిగూడెంలో ఆక్రమణకు ఏడెకరాల దళిత శ్మశాన వాటికలో శవాలపై శవాలను పూడ్చి పెట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో భూమి లేని నిరుపేదలకు భూములు పంచాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన ప్రభుత్వాసుపత్రి భవనాన్ని పూర్తి చేయాలన్నారు. మండలంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 19న తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాలో మండలంలోని అన్ని రంగాల కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు గుడెల్లి వెంకట్రావు, అనుమోలు మురళీ, మడకం కుమారి, బరగడ కుమారి, చెల్లెమ్మ, చినలక్ష్ముడు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించండి

తహశీల్దార్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో వెలుగులోకొచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో భూమి, ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు డ్రెయి నేజీ వంటి సమస్యలు తిష్టవేశాయన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో దళితుల అసైన్డ్, సీలింగ్ భూములను భూస్వాములు అన్యాక్రాంతం చేసి ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. దోసపాడు, కొవ్వలి, పోతునూరు, సత్యనారాయణపురం గ్రామాల్లో వందలాది ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని మండిపడ్డారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. కొవ్వలిలో తాగునీటి చెరువు సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. ఆ నీరు తాగడం వల్ల డయేరి యా, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నా రన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో పేదలు ఎదుర్కొంటు న్న సమస్యలపై రానున్న కాలంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. సిపిఎం నాయకులు డి.నాగేంద్ర, పి.ఆనం దరావు, సిహెచ్.జాన్‌రాజు, మాణిక్యం, దీవెనమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఎన్‌టిఆర్ ఆరోగ్య మిత్రల శాంతియుత నిరసన
కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎపి ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపుమేరకు శాంతియుత విధుల బహిష్కరణ కార్యక్రమం సోమవారం చేసినట్లు జిల్లా ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ప్రెసిడెంట్ నాగబాబు తెలిపారు. తొలుత ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ కో-ఆర్డినేటర్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్తకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా ఎన్‌టిఆర్ వైద్య మిత్రలకు క్యాడర్ గాని, మినిమం టైం స్కేల్ కూడా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ వైద్య మిత్రలకు క్యాడర్ ఇచ్చి మినిమం టైల్స్ అమలు చేసి గవర్నమెంట్ కాంట్రాక్టర్‌లో పెట్టాలని కోరారు. అదేవిధంగా డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ సిబ్బంది చనిపోతే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్ అయిన వారికి రూ.పది లక్షలు ఇవ్వాలని, ఫీల్డ్ స్టాఫ్‌కు అంతర్గత ప్రమోషన్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

నిరసన తెలుపుతున్న ఆరోగ్య మిత్రలు

కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలి

పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి
కలెక్టరేట్ వద్ద స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు జిఒ-7 ప్రకారం కనీస వేతనం రూ. 15 వేలు ఇవ్వాలని, నెలనెలా సకాలంలో జీతాలు ఇవ్వాలని, స్కూలు స్వీపర్లకు యూనిఫాం, గ్రూప్ ఇన్సూరెన్స్, పిఎఫ్, ఇఎస్ఐలు అమలు చేయాలని కోరుతూ స్కూలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.దుర్గ, కార్యదర్శి కె.విజయలక్ష్మి, నాయకులు ఎన్.విజయలక్ష్మి, పి.రమణమ్మ, తదితరులు మాట్లాడారు. స్కూల్ శానిటేషన్ వర్కర్లకు సరైన రక్షణ లేదని, సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, నాలుగైదు మాసాలకు ఒకసారి జీతాలు చెల్లిస్తున్నారని, జిఒ ప్రకారం జీతాలు ఇవ్వకపోవడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిఒ-7 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమానికి గౌస్య, సబేర, కృష్ణవేణి, రమణమ్మ, సోనీ, ముత్తమ్మ దీవెనమ్మ, ధనలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు. సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎం.దుర్గారావులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, వేలూరుపాడు, ముదినేపల్లి, పెదపాడు మండలాలకు చెందిన స్కూల్ స్వీపర్లు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు

హోంగార్డు కుటుంబాల సంక్షేమానికి కృషి

కారుణ్య నియామక పత్రాలు అందించిన ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

హోంగార్డు కుటుంబాల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. హోంగార్డులుగా పని చేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం కారుణ్య నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని హోంగార్డ్ సేలం దుర్గాప్రసాద్ సతీమణి సేలం దుర్గకు, హోంగార్డు పెద్దపాటి సత్యనారాయణ భార్య పెదపాటి అనితకు, హోంగార్డు కిషోర్ బాబు కుమారుడు నిఖిల్ సాయికుమార్‌లకు కారుణ్య నియామక పత్రాలను ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు యంత్రాంగంలో హోంగార్డు విభాగం కూడా ఒకటేనని ఆయన గుర్తు చేశారు. హోంగార్డు కుటుంబాలకు ఆయన అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకునే విధంగా పోలీసు శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కారుణ్య నియామక పత్రాలు పొందిన వారు హోంగార్డు విభాగంలో ఉత్తమమైన సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. ఎఆర్ ఆర్ఐ పవన్ కుమార్, పాల్గొన్నారు.

గుండెపోటుతో శ్రీరామమూర్తి మృతి

సిఐటియు, సిపిఎం నేతల సంతాపం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఐటియు) సహాయ కార్యదర్శి కూన శ్రీరామమూర్తి సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. శ్రీరామ మూర్తి భౌతికాయాన్ని సిఐటియు ఆగిరిపల్లి మండల కార్యదర్శి ఆర్.చంటి, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, ఏలూరు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నూజివీడు కార్యదర్శి ఎన్.రాజు, యూనియన్ కమిటీ సభ్యులు ఎం.నరేష్‌లు సందర్శించి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


జోహార్లు అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు

అపరాల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

ఎపి మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మినుములు, పెసలు (అపరాలు) కొనుగోలు కేంద్రాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసల కోసం పెదపాడు, వట్లూరు, డిసిఎంఎస్ ఏలూరు, జాలిపూడి, దెందులూరు సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మినుముల కోసం లింగాల, దేవపూడి, తామరకొల్లు, డిసిఎంఎస్ ఏలూరు, దెందులూరు, డిసిఎంఎస్ అప్పన్నవీడు, పెదపాడు, వెంకటాపురం సొసైటీల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాల కోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్ 9100955934, కంట్రోల్ రూమ్ నెంబర్ 7702003584 సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును వెంటనే పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముసునూరు

పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే అందించాలని సిపిఎం ల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చింతలవలి, గోపవరం, కాట్రేనిపాడు ముసునూరు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సోమవారం ఆయన పర్యటించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఫిబ్రవరి, మార్చి నెలల పని దినాల వేతనాలు ఇప్పటివరకు రాలేదని తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు అందించడంలేదని, టెంట్ వేయటం లేదని వివరించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ పని దినాలు వంద నుంచి 200 రోజుల వరకు పెంచి, రోజువారి పని వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇళ్లు కట్టుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అదనపు ఆర్థిక సాయం చేయడంపై ప్రభుత్వం జిఒ జారీ చేసిందని ఉంగుటూరు మండల హౌసింగ్ ఎఇ సతీష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, గిరిజనులకు రూ.లక్ష సాయం అందనుందని తెలిపారు. పిఎంఎవై (అర్బన్, గ్రామీణ్) బిఎల్‌సి-1.0 కింద ఇప్పటికే మంజూరైన ఇళ్లకు సాయం లభించనుందని చెప్పారు. అదనపు ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగుభూములకు పట్టాల కోసం 19న ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో గత 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు సాగు నమోదు చేసి హక్కులు కల్పించాలని ఏజెన్సీ గిరిజన సంఘం, ఎపి రైతు కూలీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 19వ తేదీన ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు భాషా తెలిపారు. జిల్లెల్లగూడెం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట పంచాయతీల్లో అన్యాక్రాంతమైన భూములను ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో స్వాధీనం చేసుకుని 1995 నుంచి కోయదొర, కొండరెడ్ల తెగకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్నారని, అప్పటి నుంచి అధికారులు ఆ భూములకు పట్టాలివ్వడం లేదని చెప్పారు. 1/70 పీసా చట్టం, 2005 అటవీ హక్కుల సాధన కోసం 19న ఐటిడిఎ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

42 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 42 మందికి ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన మండలంలోని చేగొండపల్లిలో ఐటిడిఎస్ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి సౌజన్యంతో గౌతమి నేత్రాలయ వైద్య బృందంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించినట్లు ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్ తెలిపారు. వారిని శిబిరం నిర్వహించిన ప్రాంతం నుంచి గౌతమి నేత్రాలయ వాహనంలో రాజమహేంద్రవరం తరలించి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ అనంతరం వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించారు.

సబ్ డిఎఫ్‌ఒను అరెస్టు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మడకం యాకోబును చిత్రహింసలకు గురిచేసి కొట్టిన సబ్ డిఎఫ్‌ఒ వెంకటసుబ్బయ్యను అరెస్ట్ చేయాలని, మిగిలిన ఫారెస్ట్ అధికారాలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన, ప్రజా సంఘాల నేతలు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి ఛైర్మన్ మొడియం శ్రీనివాస్, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నె వినోద్, కారం వాసు, మడకం యాకోబు భార్య అనిత, మడకం వెంకాయమ్మ, తెల్లం మరియమ్మ, గేడ్ల అర్జునుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐ విరాళం

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాను చదివిన పాఠశాలకు తన మిత్ర బృందం సాయంతో భారీ విరాళం అందించి ప్రభుత్వ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు ఆధునాతన విద్యను అందిస్తున్న ప్రవాసాంధ్రులు సనపల రామకృష్ణారావు భానుమతి దంపతులు ఆదర్శనీయులని కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆ పాఠశాలలో రామకృష్ణారావు దంపతులకు అభినందన సత్కార సభ నిర్వహించారు. ఆయన తన మిత్ర బృందంతో కలిసి కీట్స్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.35 లక్షలతో 30 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్ సదుపాయం, ఐదు ల్యాప్‌ట్యాప్‌లు, ఐదు స్మార్ట్ టీవీలతో పాటు తరగతి గదుల రక్షణ కోసం ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయించారని హెచ్‌ఎం అన్నారు. అనంతరం మళ్లీ రూ.ఆరు లక్షలతో విద్యార్థులకు మరుగుదొడ్డి నిర్మించి మొత్తం రూ.41 లక్షలతో పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన రామకృష్ణ భానుమతి దంపతులు ఆదర్శనీయులని పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ అల్లూరి జగదీశ్వరి అన్నారు.

చేనేత రంగానికి నిధులు కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై, జరీ, పట్టు రసాయనపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, చేనేత కార్మికుల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

మండలంలోని వెంకటకృష్ణపురం టిడిపి కార్య కర్త తాడేపల్లి రమేష్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని టిడిపి పశ్చిమగోదావరి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మొగతడకల శ్రీనివాసరావు తనయుడు ద్వారకాతిరుమల యువనాయకులు ఓంప్రకాష్ సోమవారం పరామర్శించారు. కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రేచర్ల, రాఘవాపురం గ్రామాల్లో నాటు సారా వల్ల జరిగే అనర్థాలపై గ్రామసభ నిర్వహించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ పి.అశోక్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణాచేసినా 4405, ఎక్సైజ్ స్టేషన్ 9440902428 నెంబర్లకు సమాచారం అందించాలని చెప్పారు. ప్రచార రథంలి ద్వారా రేచర్ల, పంతంగలగూడెం, గణిజర్ల, వెంకటాపురం, రాఘవాపురం, బట్టువారిగూడెం, పోతునూరు గ్రామాల్లో నాటు సారా నిర్మూలన కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బైండోవర్‌ను ఉల్లఘించిన వ్యక్తికి రూ.1.75 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామానికి చెందిన కోలగాని లక్ష్మి ఆమె భర్త లక్ష్మీనారాయణ మనవళ్లతో కలిసి ఆదివారం బైక్‌పై కామవరపుకోట మండలం వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న కనకదుర్గమ్మ తిరునాళ్లకు వెళ్లి తిరిగి ఇంటియి బయలుదేరారు. సుమారు రాత్రి 10.50 గంటల సమయంలో మండలంలోని మధ్యాహ్నవారిగూడెం శివార్లలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వీరిని ఆపి అడ్రస్ అడిగినట్లుగా వచ్చి బండిని కాలితో తన్నగా కింద పడిపోవడంతో లక్ష్మి మెడలోని బంగారు నానుతాడు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డు నిర్మాణం.. నాణ్యత శూన్యం..!

సుద్ద మట్టిని వినియోగిస్తున్నారని రైతుల ఆవేదన

నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వేడుకోలు

లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి-కన్నాయిగూడెం గ్రామాల మధ్య ఉపాధి హామీ చట్టం నిధులు రూ.70 లక్షలతో చేపట్టిన నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణం నాణ్యత లోపంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగా ఉన్న మట్టిని వినియోగించి నిర్మాణం చేపడుతున్నారని రైతులు చెబుతున్నారు. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. నాణ్యమైన గ్రావెల్ ఉపయోగించి పనులు కొనసాగిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు పనులు పున:ప్రారంభించలేదని రైతులు చెబుతున్నారు. ఈ రహదారి పూర్తయితే కన్నాయిగూడెం నుంచి కొయ్యలగూడేనికి మూడు కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, ప్రధానంగా పరింపుడి, చొప్పరామన్నగూడెం, కన్నాయిగూడెం, యదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. పనులు కొనసాగుతున్నాయని, రైతులతో చర్చించి సమస్యను పరిష్కరించామని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (పిఆర్ఎఇ) సురేష్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు ఎం.రాజీవ్‌కృష్ణ, కొడమంచిలి శ్యామలరావు, ఉండ్రాజవరం భాస్కరరావు, పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కలెక్టర్ వద్దకు వెళ్లి తమ గోడు చెప్పుకుంటామని వారు చెబుతున్నారు.

ప్రస్తుతం నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఈ నిర్మాణంతో పాటే డ్రెయినేజీ వ్యవస్థను కూడా సక్రమంగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోతే ప్రస్తుతం నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు నాణ్యత కోల్పోయి మన్నిక తగ్గుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నాణ్యమైన గ్రావెల్ వాడాలి

శుక్ల బోయిన రాంబాబు, సిపిఎం మండల కార్యదర్శి

క్షేత్ర స్థాయిలో పరిశీలించినప్పుడు అక్కడ నాణ్యత లోపం కనపడింది. శుద్దగా ఉండటంతో అది భవిష్యత్తులో జిగురుగా మరి ప్రయాణానికి ఇబ్బంది కలుగుతుంది. పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు శుద్ద మట్టిగా ఉన్న గ్రావెల్ పోశారో దాన్ని తొలగించి మళ్లీ నాణ్యమైన గ్రావెల్ పోయాలి.

శుద్ద మట్టితో రోడ్డు నిర్మిస్తే వాహనాలు వెళ్లవు

మద్దుకురి పార్థసారథి, రైతు, కన్నాయిగూడెం

నాకు ఇక్కడ ఈ రోడ్డుకు ఆనుకుని రెండు ఎకరాలు భూమి ఉంది. శుద్ద మట్టితో రోడ్డు నిర్మిస్తే వాహనాలు వెళ్లడానికి వీలుగా ఉండదు. అధికారులు స్పందించి దయచేసి రోడ్డును నాణ్యంగా నిర్మించాలని కోరుతున్నాం.

గ్రావెల్ కూడా ఎత్తుగా పోయడంలేదు

పరిటాల కుమార్, రైతు, చొప్పరమన్నగూడెం

కన్నాయిగూడెం నుంచి పరింపుడి వరకు రోడ్డు నిర్మాణం అనగానే చాల సంతోషించాం. గతంలో చాల సార్లు రోడ్డు నిర్మాణానికి కృషి చేసినా మళ్లీ ఆగిపోయేది. ఈ సారి నిర్మాణం చేపట్టినా నాణ్యత కరువైంది. భవిష్యత్తులో పోసే తారు రోడ్డు నిర్మాణం నాణ్యంగా ఉండాలి. గ్రావెల్ కూడా హైట్‌గా పోయడం లేదు. రోడ్డును నాణ్యంగా నిర్మించండి.

అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు విన్నవిస్తాం

మద్దుకూరి ప్రసాద్, రైతు, కన్నాయిగూడెం

శుద్ద మట్టిని పోసి గ్రావెల్ అంటే ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాం. కనీసం ఇక్కడ రూ.20 లక్షలతో కూడా పని ముందుకు సాగటం లేదనిపిస్తుంది. దయచేసి ఉన్నతాధికారులు దీనిపై స్పందించాలి. మళ్లీ మొదటి నుంచి నాణ్యమైన రెడ్ గ్రావెల్‌తో పోసి అపై పోసే మెటీరియల్ కూడా నాణ్యంగా ఉండేలా చూడాలి. లేకపోతే కలెక్టర్‌కు విన్నవించడమే మా ముందు ఉన్న మార్గం.

ఇప్పటివరకు పోసిన రోడ్డు రోడ్డు సరిగా లేదు

తానింకా రాజు, రైతు, చొప్ప రామన్నగూడెం

శుద్ద మట్టి వాడుతున్నారని తెలిసి పనులు అడ్డుకున్నాం. ఇప్పటివరకు పోసిన రోడ్డు కూడా చిందరవందరగా ఉంది. ప్రయాణించడానికి వీలుగా లేదు. రెడ్ గ్రావెల్ వినియోగించి రోడ్డు మొత్తం నాణ్యంగా నిర్మించాలి.

'పది' పరీక్షలకు 23,064 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 133 కేంద్రాల్లో తెలుగు పరీక్ష జరగగా మొత్తం 25,179 మందికి 23,064 మంది హాజరు కాగా 2,115 మంది గైర్హాజరరయ్యారు. 91.60 శాతం హాజరు నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ 54 కేంద్రాలను, జిల్లా కలెక్టర్ ఒక కేంద్రాన్ని, జిల్లాస్థాయి పరిశీలకులు తొమ్మిది కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఆరు కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ నాలుగు కేంద్రాలను పరిశీలించారు.

నూజివీడు టౌన్ :నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డివైఇఒ సేవ్యా తెలిపారు. డివిజన్ పరిధిలో 30 సెంటర్లలో 5,449 మంది విద్యార్థులకు 5298 మంది హాజరవ్వగా 151 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

జీలుగుమిల్లి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 417 మంది విద్యార్థులకు 385 మంది హాజరయ్యారని ఎంఇఒ-2 ఎస్.బుచ్చయ్య తెలిపారు. 32 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 244 మంది రెగ్యులర్ విద్యార్థులకు 239 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఎనిమిది మంది ప్రయివేట్ విద్యార్థులకు ఐదుగురు హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్ తెలిపారు. గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 104 మంది విధ్యార్థులకు వంద మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గౌర్హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.విజయరాఘవన్ తెలిపారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్ష కేంద్రం, ఆర్‌సిబం పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 278 మంది విద్యార్థులకు 275 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆర్‌సియం పాఠశాలలో 155 మందికి 153 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ప్రయివేట్ విద్యార్థులు ఏడుగురికి ఇద్దరు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఇఒ విఎస్‌వి.బ్రహ్మాచారి తెలిపారు.

టి.నరసాపురం : టి.నరసాపురం హైస్కూల్లో 179 మందికి 175 మంది హాజరయ్యారు. బొర్రంపాలెం హైస్కూల్లో 226 మందికి 213, అప్పలరాజుగుడెం గురుకుల పాఠశాలలో 75 మందికి నూరుశాతం హాజరయ్యారనిఎంఇఒ టి.రామమూర్తి తెలిపారు. మండలంలో మొత్తం 480 మందికి 463 మంది హాజరవ్వగా 17 మంది గైర్హాజరయ్యారు. 96.45 హాజరు శాతం నమోదైనట్లు ఆయన తెలిపారు.

చింతలపూడి : మండల వ్యాపంగా తొలిరోజు పరీక్షకు 1,356 మందికి 1,291 మంది హాజరైనట్లు ఎంఇఒ రామారావు తెలిపారు. 65 మంది గైర్హజరయ్యారని తెలిపారు.

ముదినేపల్లి : మండల వ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మూడు ముదినేపల్లిలో ఏర్పాటు చేయగా, ఒకటి పెదగొన్నూరు జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 632 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరవ్వడంతో 627 మంది పరీక్షలు రాసినట్లు ఎంఇఒ నరేష్ కుమార్ తెలిపారు.

కలిదిండి : మండలంలో ఐదు పరీక్షాకేంద్రాలు కేటాయించగా ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 182 మంది విద్యార్థులకు 177 మంది హాజరయ్యారు. కలిదిండి జెడ్‌పిహెచ్ పాఠశాలలో 263 మందికి 258 మంది, కోరుకొల్లు జెడ్‌పిహెచ్ పాఠశాలలో 215 మందికి 211, భాస్కరరావు పేట జెడ్‌పిహెచ్ పాఠశాలలో 100 మందికి 99, కలిదిండి శశి హైస్కూల్ లో 89 మంది 89 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ అల్లూరి రవిప్రకాష్ తెలిపారు. మొత్తం 849 మంది విద్యార్థులకు 836 మంది హాజరవ్వగా 13 మంది గైర్హాజరయ్యారు.

భీమడోలు : మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులతో కలిపి సోమవారం నిర్వహించిన పరీక్షకు 996 మందికి 69 మంది హాజరయ్యారు.

ముసునూరు: ముసునూరు, గోపవరం, చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాల్లో 594 మంది విద్యార్థుల్లో 12 గైర్హాజరైనట్లు ఎంఇఒ సుబ్బారావు తెలిపారు.

సుస్థిరాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

దేశ సుస్థిర అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర కీలకమని, సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో 2025లో నెలలవారీగా చేయాల్సిన పనులపై కార్యాచరణ, ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సహకార వ్యవస్థ ద్వారా జరిగే సమాజాభివృద్ధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించడంతోపాటు సహకార రంగాన్ని జిల్లాలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం అంతర్జాతీయ సహకార సంవత్సరం థీమ్ లోగోను విడుదల చేశారు.

20 కోకో రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 20వ తేదీన పెదవేగి మండలం విజయరాయిలో జరుగుతున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను కోకో రైతుల సంఘం, రైతు సంఘం నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులను ఆదుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం

జీలుగుమిల్లి : ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎపిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ జె.రామనాథం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిటి ఎం.ప్రసంగిరాజు, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, పెదపాలపర్రు

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.2/2025 తేది.14-03-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, పెదపాలపర్రు గ్రామపంచాయితీ నకు 2025-2026 సం॥నకు అనగా ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలు పనులు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు ది.19-03-2025 తేది మధ్యాహ్నం 3.00 గంటల వరకు గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, (లేదా) వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం 4-00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు షరతులు మిగిలిన విషయములు కార్యాలయము పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనులు నిర్వహణ 2 వ్యక్తులు	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/- లేదా తత్సమానమైన
2	మంచినీటి సరఫరా వదులుట, కట్టుటకు 1 వ్యక్తి	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/- లేదా తత్సమానమైన
3	వీధిదీపములు రిపేరు చేసి, కొత్తవి వేయుటకు 1 వ్యక్తి	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ.1000/- లేదా తత్సమానమైన

గమనిక: 1) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) గ్రామ పంచాయితీ నిధులను బట్టి చెల్లింపులు జరుపబడును. 3) టెండర్లు నిర్వహించుటకు (లేదా) రద్దుచేయుటకు గ్రామపంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- గంటా రాకేష్‌కుమార్
సర్పంచ్, పెదపాలపర్రు గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- యం. గోవర్ధనరావు
గ్రామపంచాయితీ కార్యదర్శి, పెదపాలపర్రు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

PUBLICATION

My client namely **SEEMAKURTHI JAYA SRI, D/o.Sri Rama Gangaraju, (Adhar No.93009601 4745) R/o.Koyyalagudem Village and Mandal.** Her Passport Number **R2780217** which was issued by the Government of India at Visakhapatnam dated **03-07-2017** and she was lost the same at Zerox Shop in Kannapuram Road in Koyyalagudem Village on **05-03-2025.** I have been searching for same in surrounding areas along with my people also, but no use. I could not trace the same till today. If any-one find out the passport please contact us.

Sri. Dr.Solasa Ravi Dharma Raju,
Advocate, Chintal Road, Aswaraopeta Road,
Jangareddigudem Town,
Now Eluru Dist. Cell: 9951666636.

మహారాజశ్రీ 14వ అదనపు జిల్లా జడ్జి కోర్టు మరియు ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు, విజయవాడ

ఇన్

ఎఫ్.సి.ఓ.పి. నెం. 1543/2023

బిట్వీన్:
కటికల జీవన్ బాబు ..... పిటిషనరు
మరియు
కటికల సునీత ..... రెస్పాండెంటు

రెస్పాండెంటు చిరునామా :
కటికల సునీత, భర్త: జీవన్ బాబు,
ఆలపాడు గ్రామం, కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా.

పై నెంబరు తెలిపిన పిటిషన్లలో ఇన్ ఎఫ్.సి.ఓ.పి. నెం.1543/2023, మీరు రెస్పాండెంటు అయివున్నారు. మీకు పై తెలిపిన కోర్టు నుండి నోటీసులు పంపించి ననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. ఇట్టి స్థితిలో కోర్టువారు ప్రజాశక్తి పేపరు ప్రకటనకు ది.12.03.2025న ఆర్డరు యివ్వటం జరిగినది. పై నెంబరు పిటిషన్లలో ది. 17.04.2025నకు వాయిదా అయివున్నది. మీకు కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయుచున్నాము. కావున మీరు పై తెలిపిన కోర్టుయందు ఉదయం 10.30 గం॥లకు మీరు ప్రత్యక్షంగాగానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షముగా కోర్టువారు తీర్మానము చేయుదురు.

//కోర్టువారి అనుమతితో//

వాయిదా తేదీ: 17.04.2025
విజయవాడ
ది.13.03.2025

ఎం. సురేష్ కుమార్
న్యాయవాది, విజయవాడ

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 150/2019

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
పట్టిసాపు విట్టల్ లక్ష్మి రాజేశ్వరి వగైరా ...ప్రతివాదులు

2వ ప్రతివాది: కట్ట వెంకన్న, తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం. 21-2-25, బంగారు వారి చెరువు, పాలకొల్లు, వెస్ట్ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 1వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్మాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది. 05-04-2025 తేదికి** వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 05-04-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం B.Com. B.L.,
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా
ది. 10-03-2025 — స్టాండింగ్ కౌన్సెల్ ఫర్
బ్యాంకు ఆఫ్ బరోడా నరసాపురం బ్రాంచ్

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 5/2021

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
తోట దుర్గాదేవి వగైరా ...ప్రతివాదులు

1వ ప్రతివాది: తోట దుర్గాదేవి, భర్త: దుర్గా ప్రసాద్, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాల వారి వీధి, రామారావుపేట్, తాడేపల్లిగూడెం, వెస్ట్ గోదావరి జిల్లా.

2వ ప్రతివాది: తోట దుర్గా ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాల వారి వీధి, రామారావుపేట్, తాడేపల్లిగూడెం, వెస్ట్ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్మాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది. 02-04-2025 తేదికి** వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 02-04-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం B.Com. B.L.,
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా
ది. 10-03-2025 — స్టాండింగ్ కౌన్సెల్ ఫర్
బ్యాంకు ఆఫ్ బరోడా నరసాపురం బ్రాంచ్

ఇన్ ది కోర్ట్ ఆఫ్ ది ఏజెంట్ టు గవర్నమెంట్, (జిల్లా కలెక్టర్), భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం

O.S.No. 147/2024

బిట్వీన్ :
పొట్ట పోతురాజు .... వాది
మరియు
కొర్స ధర్మరాజు .... ప్రతివాది

టు :
కొర్స ధర్మరాజు తండ్రి : పోతప్ప, వయస్సు :43 సం'లు, వృత్తి : వ్యవసాయం, కులం: ST (కోయ), నివాసం: తీగనపల్లి, టి.నర్సాపురం మండలం, ఏలూరు జిల్లా.

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన వాది ప్రతివాదిపై ఇంజన్క్షన్ దావా వేసియున్నారు, ఇట్టి దావా కేసు O.S.No.147/2024, ది.29-03-2025న వాయిదా కలదు. కావున ప్రతివాదికి అభ్యంతరాలు వున్నచో ది.29-03-2025న, ఉదయం. 10:30 గంటలకి మీరు కాని, మీ తరుపున న్యాయవాది ద్వారా కాని ఇట్టి కోర్టుకి హాజరై తెలియజేయగలరు. లేని యెడల పరోక్షముగా కోర్టువారు తీర్పును ఇవ్వగలరని తెలియజేయుటమైనది.

తేదీ : 17-03-2025
// కోర్టు వారి అనుమతితో //
17-03-2025

PAYAM.RAVIVARMA, B.A,LL.M,
ADVOCATE
Office: ITDA, Shopping Complex
Room No.15, Old Market,
Bhadrachalam Town and Mandal,
B-Kothagudem District,
TS-507111.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE COURT : NARSAPUR

E.P.No.13/2024 in O.S.No.9/2023

Between:
Perikela Sri Hari Satyanarayana Hari Babu ...Petitioner/DHR
And
Sri Eda Samuel David ...Respondent/JDR

The petitioner filed the petition against you for claiming decree amount The petitioner sending notices through court and Registered post to you for several times. But the said notices were returned. As per the directions issued by this Hon'ble Court I hereby issued notice to you through paper publication and informed you that the case stands posted to **24-03-2025** for your appearance. I advised you to attend the court with out fail on **24-03-2025 at 10.30 A.M.** in the above cour by personally or through your advocate. Other wise, the court will be decide in your absence and you will obliged the same.

Sd/- R.G.Kumar
Narsapur — Advocate, Narsapur.
Dt.16-03-2025 — Cell: 9182911146

గ్రామపంచాయతీ కార్యాలయము, గూటాల, పోలవరం మండలం, ఏలూరు జిల్లా

టెండరు నోటీసు

రి.క. నెం.1/2024 తేది.15-3-2024

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామపంచాయతీకి 2024-2025 సం॥నకు అనగా ది. 01-04-2024 నుండి 31-03-2025 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 20-03-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 2.00 లకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	03	100/-
2	పారిశుద్ధ్య స్వీపరు పోస్టులు	04	100/-
3	క్లాప్ మిత్రా	03	100/-
4	క్లాప్ మిత్రా & Shed	01	100/-
5	ఎలక్ట్రీషియన్	01	100/-
6	ముగ్గు, బ్లీచింగ్ సప్లయి చేయుటకు 2024-2025 సం.నకు టెండరు పిలుచుట		500/-
7	వాటర్ వర్క్ సామాగ్రి సప్లయి చేయుటకు 2024-2025 సం.నకు టెండరు పిలుచుట		500/-
8	పారిశుద్ధ్య సిబ్బందికి స్టేషనరీ సప్లయి చేయుటకు 2024-2025 సం.నకు టెండరు పిలుచుట		200/-
9	PH ఆర్టికల్స్ సప్లయి చేయుటకు 2024-2025 సం.నకు టెండరు పిలుచుట		500/-
10	వీధి దీపములు విడి భాగములు సప్లయి చేయుటకు 2024-2025 సం.నకు టెండరు పిలుచుట		500/-

సం/- **తాతి విజయకుమారి,** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - గూటాల, పోలవరం మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, గూటాల, పోలవరం మండలం, ఏలూరు జిల్లా

టెండరు నోటీసు

రి.క. నెం.1/2025 తేది.15-3-2025

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 20-03-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 2.00 లకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	03	100/-
2	పారిశుద్ధ్య స్వీపరు పోస్టులు	04	100/-
3	క్లాప్ మిత్రా	03	100/-
4	క్లాప్ మిత్రా & Shed	01	100/-
5	ఎలక్ట్రీషియన్	01	100/-
6	ముగ్గు, బ్లీచింగ్ సప్లయి చేయుటకు 2025-2026 సం.నకు టెండరు పిలుచుట		500/-
7	వాటర్ వర్క్ సామాగ్రి సప్లయి చేయుటకు 2025-2026 సం.నకు టెండరు పిలుచుట		500/-
8	పారిశుద్ధ్య సిబ్బందికి స్టేషనరీ సప్లయి చేయుటకు 2025-2026 సం.నకు టెండరు పిలుచుట		200/-
9	PH ఆర్టికల్స్ సప్లయి చేయుటకు 2025-2026 సం.నకు టెండరు పిలుచుట		500/-
10	వీధి దీపములు విడి భాగములు సప్లయి చేయుటకు 2025-2026 సం.నకు టెండరు పిలుచుట		500/-

సం/- **తాతి విజయకుమారి,** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - గూటాల, పోలవరం మండలం, ఏలూరు జిల్లా